

TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-229 | పేజీలు:-4 | శనివారం 01-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD | HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం



- పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- భోగాపురం నుంచి రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని
- విశాఖలో సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు పలు విద్యుత్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన

**అమరావతి :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీలో సుమారు రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. - మిగతా 2 లో

## ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు
# 45 లక్షల ఓట్లు తొలగింపు

- ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ప్రత్యేక సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఓట్ల తొలగింపు
- శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తొలగించినట్లు వెల్లడి
- పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం
- అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ




**అమరావతి :**
ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. - మిగతా 2 లో




## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు
- రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు
- నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్

**అమరావతి :**
రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం - మిగతా 2 లో

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు



- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు

**ఢిల్లీ :**
దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత - మిగతా 2 లో

## రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్




- కొత్త రకం డీజిల్‌ను ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్
- ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ వినూత్న తరహా డీజిల్ ఆవిష్కరణ
- మైనస్ 42 డిగ్రీల చలిలోనూ సమర్థంగా పనిచేసే ఇంధనం
- స్వదేశీ పరిజ్ఞానంతో సైన్యం, ఆయిల్ కంపెనీల సంయుక్త రూపకల్పన
- హిమాలయాల్లో సైనిక వాహనాల సమర సన్నద్ధత పెంపు
- ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగంలో కీలక ముందడుగు

**ఢిల్లీ :**
భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు.సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్-౬ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా - మిగతా 2 లో

## పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు



**భద్రాచలం :**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. - మిగతా 2 లో

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే వాహనం సీజ్, క్రిమినల్ కేసు

- హైదరాబాద్ సిటీ పోలీసులు
- నెంబర్ ప్లేట్లు మార్చే వారిపై పోలీసుల ఉక్కుపాదం
- ప్రత్యేక తనిఖీల్లో ఆరుగురిపై కేసు నమోదు
- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే వాడాలని సూచన




**హైదరాబాద్ :**
వాహన చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లు మార్చినా, అంకెలు సరిగా కనిపించకుండా ట్యాంపరింగ్ చేసినా ఇక జైలు శిక్ష తప్పదు. నగరంలో నకిలీ నంబర్ ప్లేట్లతో - మిగతా 2 లో




## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్
- ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్ రెడ్డి
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు

**హైదరాబాద్ :**
ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై - మిగతా 2 లో

## తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు




- ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్ :**
తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా - మిగతా 2 లో

# అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- నైపుణ్యాభివృద్ధిశక్తి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం
- టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచన



**హైదరాబాద్ :**
తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ కంపెనీల్లో ఉద్యోగాల వరకు టామ్‌కామ్ బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవెలియన్‌లో స్కిల్స్, క్యాపిటల్, నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇనీషియేటివ్ శాఖ(శక్తి) కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు.దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.యంగ్ ఇండియా - మిగతా 2 లో

# సంపాదకీయం


## సైబర్ మోసాలకు చెక్.. బహుముఖ వ్యూహాలే పరిష్కారం

(హెచ్.ప్రతాప్)

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్న తరుణంలో సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా విస్తరిస్తున్నాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, డిజిటల్ సేవల వినియోగం పెరగడం ప్రజలకు సౌలభ్యం కల్పించినా, నేరగాళ్లకు కొత్త అవకాశాలను తెరిచింది. ప్రపంచంలో అత్యధిక సైబర్ మోసాలు నమోదవుతున్న దేశాల్లో భారత్ ముందంజలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలు ప్రజల ఆర్థిక భద్రతతో పాటు చట్ట అమలు సంస్థలపై విశ్వాసాన్నీ దెబ్బతీస్తున్నాయి. డిజిటల్ అరెస్ట్ మోసాల్లో నేరస్థులు పోలీసు లేదా దర్యాప్తు సంస్థల అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేస్తారు. మనీ లాండరింగ్, మాదకద్రవ్యాలు, పార్శిల్ మోసాలు వంటి కేసుల్లో పేరు ఉందని, అరెస్టు వారెంట్ సిద్ధంగా ఉందని బెదిరిస్తారు. ముందుగానే లీకైన వ్యక్తిగత సమాచారాన్ని చూపించి బాధితుల్లో నమ్మకం కలిగిస్తారు. గంటల తరబడి ఫోన్‌లో ఉంచి, విచారణ పేరిట డబ్బును 'భద్రతా ఖాతా'లో జమ చేయాలని ఒత్తిడి తెస్తారు. ముఖ్యంగా వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ఈ మోసాలకు ఎక్కువగా బలవుతున్నారు. 2022 నుంచి 2026 మే వరకు దేశంలో దాదాపు మూడు లక్షల డిజిటల్ అరెస్ట్ ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటి వల్ల రూ.4,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. పార్లమెంట్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, 2024లో సైబర్ మోసాల కారణంగా భారతీయులు రూ.22,845 కోట్లు కోల్పోయారు. అదే ఏడాది 22 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ గణాంకాలు సైబర్ నేరాలు ఇప్పుడు విడివిడిగా జరిగే ఘటనలు కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను సవాలు చేస్తున్న ముప్పుగా మారాయని స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న సమాచార సాంకేతిక చట్టం--2000 ప్రధానంగా ఎలక్ట్రానిక్ లావాదేవీలు, డిజిటల్ రికార్డులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. కృత్రిమ మేధస్సు ఆధారిత మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనే ప్రత్యేక నిబంధనలు అందులో లేవు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సూచించినట్లుగా 'డిజిటల్ అరెస్ట్'ను ప్రత్యేక నేరంగా నిర్వచించి, కఠిన శిక్షలను అమలు చేసేలా చట్టాలను సవరించడం అత్యవసరం. అలాగే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సైబర్ నేరాలను ఎదుర్కొనే ప్రత్యేక దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సైబర్ నేరాలను అరికట్టాలంటే చట్టపరమైన చర్యలతో పాటు సాంకేతిక పరిష్కారాలు కూడా కీలకం. కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలతో అనుమానాస్పద లావాదేవీలు, నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత ఖాతాలను తక్షణమే గుర్తించే సామర్థ్యాన్ని పెంచాలి. బ్యాంకులు, టెలికాం సంస్థలు, దర్యాప్తు సంస్థలు పరస్పరం సమాచారాన్ని వేగంగా పంచుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదే సమయంలో ప్రజల్లో సైబర్ అవగాహన పెంపు, వ్యక్తిగత సమాచార రక్షణ, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకపోవడం వంటి జాగ్రత్తలు కూడా అత్యంత అవసరం. సైబర్ మోసాలు ఇక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సవాలుగా మారాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా చట్టాలను నవీకరించడం, కృత్రిమ మేధస్సును రక్షణ సాధనంగా వినియోగించడం, సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడం, ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ద్వారా మాత్రమే ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చు. సైబర్ భద్రతను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా భావించినప్పుడే డిజిటల్ భారతం మరింత సురక్షితంగా మారుతుంది.

# ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు

**మొదటిపేజీ తరువాయి -** మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే




ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్ఓ/ఏఈఆర్ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు. ఈ భారీ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 46,397 మంది బీఎల్ఓలు సమన్వయంతో పనిచేశారని ఆయన అభినందించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నాయని, గతంలో 68,868 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 1,27,868కి పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం

**మొదటిపేజీ తరువాయి -** విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం ప్రధాని షెడ్యూల్ లో కీలకంగా నిలవనుంది. మోదీ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసింది. ఈ పర్యటన ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక ప్రగతికి గణనీయమైన ఊపునిస్తుందని భావిస్తున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఉదయం 10:45 గంటలకు ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలుకుతారు. ఉదయం 10:58 గంటలకు ప్రధాని టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి, అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో కలిసి విమానాశ్రయంలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత, ప్రధాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్-టాప్ వాహనంలో బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మార్గమధ్యలో 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ 'ధింసా' నృత్యంతో ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:55 గంటల వరకు ప్రధాని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటక పర్యటనకు పయనమవుతారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఒకటిగా ఇది నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో టెర్మినల్‌ను నిర్మించారు. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం 2,703 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాల్లో విమానాశ్రయం, మిగిలిన ప్రాంతంలో ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, వాణిజ్య, నివాస సముదాయాలు ఏర్పాటు చేయనున్నారు.

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే



**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి -** పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది. పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక



చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది. సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ



**మొదటిపేజీ తరువాయి -** ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

## అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు



**మొదటిపేజీ తరువాయి -** స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైనటువంటి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని ఆయన సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లుగానే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందే వారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఏటీసీల్లో(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల)లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని ఆయన సూచించారు.

## రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్

**మొదటిపేజీ తరువాయి -** వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సమర సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కృషి, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక ఇంధనాల తయారీకి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. కేవలం సైనిక అవసరాలకే కాకుండా, తీవ్రమైన చలి ఉండే ప్రాంతాల్లో పౌర రవాణా అవసరాలకు కూడా ఈ డీజిల్ ఎంతగానో దోహదపడనుంది. ఈ కార్యక్రమానికి ముందు, ఆర్మీ చీఫ్ తూర్పు సెక్టార్‌లోని సైనిక ఫార్మేషన్లను రెండు రోజుల పాటు సందర్శించి, అక్కడి భద్రతా సన్నద్ధతను మరియు వరద సహాయక చర్యలను సమీక్షించారు.

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే వాహనం సీజ్ , క్రిమినల్ కేసు

**మొదటిపేజీ తరువాయి -** రోడ్లపై తిరుగుతున్న వాహనదారులపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా... ఫేక్ ప్లేట్లను వినియోగిస్తున్న ఆరుగురిపై ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాలతో పాటు మేడిపల్లి, పెద్దపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. కొంతమంది నిఘా కెమెరాల నుంచి, ఈ-చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్లను మార్చడం లేదా వేరే వాహనం నంబర్‌ను వాడుకోవడం లాంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. పోలీసుల హెచ్చరికల ప్రకారం... ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిన 'హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు' మాత్రమే వాహనాలకు ఉండాలి. నంబర్ ప్లేట్లపై ఏ విధమైన ఫ్యాన్సీ ఫాంట్లు, స్టిక్కర్లు, దేవుళ్ల బొమ్మలు లేదా నంబర్లను అస్పష్టంగా మార్చే ప్రయత్నాలు చేయకూడదు. నకిలీ ప్లేట్లతో దొరికితే కేవలం ఫైన్‌తో వదిలిపెట్టకుండా, వాహనం సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.


## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా



**మొదటిపేజీ తరువాయి -** చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి -** సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర




ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

# హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి

**హైకోర్టు తాజా ఉత్తర్వులు**

**లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం**

**వివాదాస్పద స్థలంలోకి సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని స్పష్టం**

**వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో



ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.

# కిసాన్ నగర్ పీ.హెచ్.సీ.ని. ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి...



మెండోరా మండల **జూలై 31 నిజం న్యూస్:** హెచ్. ఐ. వి.సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం వర్ష కాలం దృశ్య సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి డా. రాజశ్రీ శుక్రవారం కిసాన్ నగర్ పీహెచ్ సీ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఆసుపత్రిలోని ఓ. పి , ఫార్మసీ, ల్యాబ్ హెచ్. ఐ. వి వ్యాక్సినేషన్ సెంటర్లను డీఎంహెచ్ఓ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వ, పరీక్షల వివరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో విరేచనాలు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. ఓ. పీ.కి వచ్చే ప్రతి జ్వరం కేసును పూర్తిగా పరీక్షించి, అవసరమైన రక్త పరీక్షలు చేయాలని సూచించారు టీబీ లక్షణాలు ఉన్న రోగులను గుర్తించి వెంటనే కఫం పరీక్షలు చేయించాలి. టీబీ రోగులకు నిరంతరం ఫాలోఅప్ చేసి మందులు సక్రమంగా ఇప్పించాలని ఆదేశించారు. 14 సంవత్సరాల బాలికలకు హెచ్. పి.వి.వ్యాక్సినేషన్‌ను 100% లక్ష్యంగా పూర్తి చేయాలి. పాఠశాలలు, అంగన్‌వాడీలతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫార్మసీలో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి. గడువు ముగిసిన మందులు ఉండకూడదు. ల్యాబ్‌లో పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలని, నాణ్యత పాటించాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. శుభ్రత పాటించి, క్లీనింగ్ పనులను క్రమం తప్పకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని, అందులో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బసంతపురంలో భూ సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



రాజపేట **జూలై 31 నిజం న్యూస్:** రాజపేట మండలం బసంతపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద భూ సర్వే పనులను శుక్రవారం రోజున అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. సర్వే ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. భూయజమానులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు, భూ వివాదాలకు తావు లేకుండా సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. భూ రికార్డుల పారదర్శకత, భూ వివాదాల పరిష్కారం, ప్రభుత్వ సేవల సులభతర అమలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మోత్కుపల్లి సత్యం, తాసిల్దార్ గోలి రవి కిరణ్, ఆర్ ఐ నరసింహులు, జి పి ఓ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఎం బి ఆర్ ఫౌండేషన్ చైర్మన్, మెన్దు భాస్కర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంజ నరేష్, బసంతపురం సర్పంచ్ మెందు రత్నమాల సత్తిరెడ్డి, ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, కాల్వపల్లి సర్పంచ్ ఇంజ లక్ష్మి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఇరు గ్రామాల రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రెమిడియేషన్ ద్వారా విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాస్




హసన్ పర్తి, హనుమ కొండ (ప్రతినిధి) **జూలై 31 నిజం న్యూస్:** రేమిడియేషన్ ద్వారా విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాన్ని పెంచాలని మండల విద్యా వనరుల అభివృద్ధి అధికారి ఏ శ్రీనివాస్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులశిక్షణలోభాగంగా హసన్ పర్తి మండలంలో రెండో విడత ఉపాధ్యాయ శిక్షణ ముగింపు సభలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ రెమిడీయేషన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా, వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి, కనీస అభ్యర్థన సామర్థ్యాలను ఎఫ్ ఎల్ ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి) కార్యక్రమం ద్వారా పెంచాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చూపాలని ఉపాధ్యాయులను కోరారు. గత సంవత్సరం వలెనే ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం జరిగిన మార్పులు ఉపాధ్యాయులు గమనించాలని కోరారు. వర్క్ షీట్స్, సిలబస్ మాడ్యూల్, టెక్ట్స్ బుక్స్ అలైన్మెంట్ చేస్తూ ఉపాధ్యాయులు బోధన చేయాలని, ప్రతి ఐదు రోజుల బోధన తర్వాత విద్యార్థులతో ప్రాక్టీస్ షీట్ చేయించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం కొత్తగా కంప్యూటర్ ల్యాబ్ లను ప్రవేశపెట్టడం జరిగిందని కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక మెలకువలు నేర్పించాలని, వ్యాయామ విద్య ద్వారా ఆరోగ్య నియమాలు బోధించాలని ఎంఈఓఈసందర్భంగాతెలిపార. తరగతి గదిలో 80 శాతం మంది విద్యార్థులు నిర్దేశించిన సామర్థ్యాన్ని సాధించే విధంగా తరగతి బోధన ఉండాలి. ఒకటి నుండి 5వ తరగతి వరకు నిర్దేశించిన సామర్థ్యాలను తరగతుల వారీగా సబ్జెక్టుల వారిగా ప్రతి విద్యార్థి సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలోవిషయనిపుణులు శ్రీధర్,కవిత, రేవతి, మల్లేశం, సి అర్ పి రాజకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# బురద రోడ్లపై తిప్పనపల్లి కాలనీ వాసుల నిరసన...!



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జూలై 31 నిజం న్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం(కెసి.ఆర్. కాలనీ) లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారినా పట్టించుకోవడం లేదని అధికారుల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం కాలనీవాసులు బురదలో నిలబడి తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... గత ఏడాదిగా కాలనీలో బురద రోడ్లు ఉన్నాయని, తాగునీటి సమస్య సైతం ఉన్నదని పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. తాము వారికి ఓట్లు వేయలేదని అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారని,తాము ఏ పార్టీకి ఓట్లు వేశామో వాళ్లెనే నిర్ణయిస్తారని ప్రశ్నించారు. అధికారులు సైతం అధికార పార్టీ నేతలు చెప్పినట్లు వింటున్నారని, తమ సమస్యలు పట్టించుకోకపోతే, అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయకపోతే పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# నూతన వైద్యురాలుగా బాధ్యతలు స్వీకరించిన నజ్ నిన్ తబసుమ్...!




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, **జూలై 31 నిజం న్యూస్:** అన్నపురెడ్డిపల్లి మండల వైద్యురాలుగా ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాలలో నజ్ నిన్ తబసుమ్ భాధ్యతలు స్వీకరించారు. ఆమె 2018 లో విధుల్లో చేరారు.అనంతరం మాట్లాడుతూ మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తానన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య శాలలో మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను సిబ్బంది బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బీడీ కార్మికుల పిల్లల స్కాలర్షిప్ దరఖాస్తులను 100% నమోదు కోసం బీడీ కార్మికులు అందరు కృషి చేయాలి

రాపెల్లి శ్రీనివాస్

మజ్దూర్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్లడి...

**జూలై 31 నిజం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో బీడీ ఆన్లైన్ స్కాలర్షిప్ దరఖాస్తులను,నమోదు అయ్యేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాపల్లి శ్రీనివాస్ తెలిపారుఎ బీడీ కంపెనీ యాజమాన్యం, కమిషన్ దారులు,బీడీ కార్మిక సంఘ నాయకులు,ప్రతి ఒక్కరు భాగస్వామ్యంతో బీడీ కార్మికుల పిల్లల స్కాలర్షిప్ ల నమోదు కార్యక్రమాన్ని 100% పూర్తి నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందనీ రాపల్లి శ్రీనివాస్ శుక్రవారం రోజున మాట్లాడుతూ తెలిపారు. లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్లను నమోదు కోసం, ఆదాయ సర్టిఫికెట్,1,20,000 రూపాయల పరిమితిని తొలగించాలని, హైదరాబాదులోని లేబర్




వెల్ఫేర్ ఆర్గనైజేషన్, వెల్ఫేర్ కమిషనర్ కి గురువారం వినతి పత్రం సమర్పించారు. బీడీ వెల్ఫేర్ హాస్పిటల్ డిస్పెన్సరీ నిజాంబాద్ జిల్లా కేంద్రంలోని, బీడీ వెల్ఫేర్ హాస్పటల్లో డాక్టర్ మహేష్ బాబుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ బీడీల దావకానాల ద్వారా, ప్రతి బీడీ కార్మికులకు, కార్మికుడికి డిజిటల్ హెల్త్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.అన్ని రకాల మందులను కార్మికులకు అందుబాటులో ఉంచాలని,అదేవిధంగా ప్రతి డిస్పెన్సరీలో మెడికల్ ఆఫీసర్ నర్స్, ఇతర సిబ్బందిలను నియామకం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా కోరారు. టీ.బి. క్యాన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించే విధంగా పథకాలను ప్రవేశపెట్టాలన్నారు. సంచార వైద్యశాల ద్వారా గ్రామాలలోని బీడీ కార్మికులకు, వైద్య పరీక్షలు ప్రారంభించాలని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని బీడీ కార్మికుల కోసం 500 పడకల హాస్పిటల్ ను, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను నిర్మాణం చేయాలని లేఖల ద్వారా కేంద్రం ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న స్కాలర్షిప్లను పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వెల్ఫేర్ కమిషనర్ కి,డైరెక్టర్ జనరల్ లేబర్ న్యూఢిల్లీకి నిజామాబాద్ డిస్పెన్సరీ ద్వారా వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, తదితరులు,పాల్గొన్నారు.

# పాలకులు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిద్దాం.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్.






**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,జూలై 31 :** శుక్రవారం నాడు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ నారాయణ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు సభ్యత్వాలు అందించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... నాణ్యమైన విద్య, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని, పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా కాలయాపన చేస్తున్నారు. పేద వాడికి నాణ్యమైన ఉచిత విద్య అందకుండా కుట్రలు చేస్తున్నారు.విద్యారంగంలో ఎదురవుతున్న సవాళ్లపై పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శి ఎండి, అన్వర్ , ఉపాధ్యక్షుడు హరీష్ , కృష్ణ , భరత్ , అరవింద్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీఓగా పదవీ విరమణ పొందిన కర్ణాకర్ రెడ్డి దంపతులకు సన్మానం

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

ఎంపీఓగా పదవీ విరమణ పొందిన కర్ణాకర్ రెడ్డి కి ఘన సన్మానం

హసన్ పర్తి, హనుమ కొండ (ప్రతినిధి) **జూలై 31 నిజం న్యూస్:** ఎంపీ ఓ గా పదవి విరమణ పొందిన కర్ణాకర్ రెడ్డి దంపతులనుహసన్ పర్తి ఎం పి డి ఒ అధికారులు సిబ్బంది ఘనంగా శాలువాతో సన్మానించారు. విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే.. ప్రభుత్వ ఉద్యోగులు జీవితంలో పదవి విరమణ చేయడం తప్పని సరి అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)సుమనవాణి అన్నారు. హనుమకొండ జిల్లా హాసన్ పర్తి మండలపంచాయతీ అధికారి (ఎంపీఓ) గా విధులు నిర్వహించిన కట్ల కర్ణాకర్ రెడ్డి శుక్రవారం పదవీ విరమణ5 చేశారు.ఈమేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది, కారోబార్,బిల్ కలెక్టర్ లు ఉద్యోగులు, మండల పరిషత్



సిబ్బంది కరుణాకర్ రెడ్డి దంపతులను శాలువలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయమనిపేర్కొన్నారు. జీవితంలో మనం చేసిన పనులు శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు.పదవి విరమణ మూలంగా జీవితంలో ఒక ముఖ్య భాగం ముగిసి, మరో అంకం ప్రారంభమవుతుందని అన్నారు.వారి శేష జీవితం కుటుంబ సభ్యులతో సంపూర్ణమైన ఆయురారోగ్యాలతో గడపాలని కోరారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులు జనగాం అశోక్ గౌడ్ మాట్లాడుతూ 32 ఏళ్లుగా సేవలందించిన కరుణాకర్ రెడ్డి జిల్లాలో ఉత్తమ మండల పంచాయతీ అధికారిగా అవార్డు పొందడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ఉద్యోగులు జీవితంలో పదవి విరమణ తప్పనిసరి అని పేర్కొన్నారు.మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులు ఎం యాదగిరి మాట్లాడుతూ కరుణాకర్ రెడ్డి తన పదవి కాలంలో పాటించిన విధి విధానాలు,సలహాలు, సూచనలు తమకు ఆచరణాత్మకమైనవిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు జి వెంకన్న, కారోబార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతల్ల సదానందం,జిల్లా అధ్యక్షులు తగరం శివ,మండల అధ్యక్షులు బండి రమేష్, ప్రధాన కార్యదర్శి కుక్కముడి నరేష్. జిల్లా నాయకులు కూకట్ల కుమారస్వామి,ఆరే సమ్మిరెడ్డి,కాదారి ప్రవీణ్ కుమార్,తాళ్ళపెల్లి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

# తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి

ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే త్రాగించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య

హనుమ కొండ ( ప్రతినిధి) **జూలై 31 నిజం న్యూస్:** తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివని మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలని డాక్టర్ అప్పయ్య తెలిపారు. శు క్రవారంజిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య ఆగష్టు 1 నుండి 7 వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లి పాలప్రాముఖ్యతనుగురించి ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసందర్భంగా ఆయన పత్రికా ముఖంగామాట్లాడుతూ మొదటి 6 నెలలు బిడ్డ కు తల్లి పాలను మాత్రమే తాగిశీచాలని, కాన్పు అయిన మొదటి కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయని, దీనిని ముర్రుపాలు లేదా కొలెస్ట్రాశీ అంటారని తెలిపారు. ముర్రుపాలలో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఎక్కువగా ఉంటుందని. వీటికి తోడుగా విటమిన్ ఎ,బి లతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుందనిఅన్నారు. ముర్రుపాలు బిడ్డకు సంజీవని వంటివని, ఇవి అమృతంతో సమానమని ఆయన తెలిపారు. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారని అప్పుడే పుట్టిన బిడ్డ ప్రేగులకు జీర్ణశక్తిని బాగా ఉంచడంలో తోడ్పడతాయని అంతేకాక, కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుండి కాపాడతాయని ఆయన తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అత్యంత సహజమైన, సురక్షితమైన పుష్టికరమైన ఆహారం,సీసా పాలు త్రాగే పిల్లల కన్నా తల్లిపాలు త్రాగే పిల్లలు ఎక్కువ బలంగాతెలివిగావుంటారు. ముర్రు పాలు తాగే పిల్లలకురోగాలను ఎదుర్కొనే శక్తి ఎక్కువగా వుంటుందని అలాగే తల్లి పాలు తేలికగా అరుగుతాయని ఇవిశుభ్రంగా ఎటువంటి క్రిములు లేకుండా వుంటాయని తల్లిపాలు పిల్లలను శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, ఆస్తమా, చర్మవ్యాధుల నుండి రక్షిస్తాయని ఆయన తెలిపారు. తల్లిపాలు త్రాగే బిడ్డ యొక్క దవడలు బాగాబలపడతాయని. బిడ్డకు పాలు త్రాగించే తల్లికి మనసులో తృప్తితో బాటు, నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగాఉంటుందని పాలిచ్చినంత కాలం గర్భం రాకుండా గర్భ నిరోధకంగా కూడా పని చేస్తుందని అన్నారు. పగలూ, రాత్రీ కలిపి బిడ్డకు కనీసం 8-10 సార్లు పాలివ్వాలి. పుట్టిన దగ్గర నుండి 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని పై ఆహారం వద్దు అని 7 నుండి 8 నెలల వయస్సు లో తల్లిపాల తో పాటు 3 సార్లు పై ఆహారం ఇవ్వాలని,9 నుండి 11 నెలలు, తల్లిపాల తో పాటు 4 సార్లుపై ఆహారం ఇవ్వాలని తెలిపారు. బిడ్డ శరీరం పూర్తిగా తల్లి ఒడిలో ఉంచినందువల్ల బిడ్డకు చక్కటి ఆసరా లభిస్తుంది. దీని వల్ల తల్లి



బిడ్డకు చక్కని అనుబంధం ఏర్పడుతుంది, బిడ్డకు వెచ్చదనం లభిస్తుంది. బిడ్డ నోరు తెరవగానే చనుమొనను బిడ్డ నోటికి అందించాలని తెలిపారు. బిడ్డయొక్కక్రిందిపెదవి, చనుమొన పూర్తిగా బిడ్డ నోటిలోకి వెళ్ళాలి. బిడ్డకు రెండు స్తనాల నుంచి పాలు త్రాగించాలి ఒక స్తనంలో పాలు బిడ్డ పూర్తిగా త్రాగటానికి దాదాపు 20 నిముషాలు పడుతుందనీ తెలిపారు.




# రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గం మహిళా జనరల్ సెక్రెటరీ దేవసాని ప్రియదర్శిని

హుజురాబాద్ **జూలై 31 నిజం న్యూస్:** హుజురాబాద్ ఆర్డీవో కి బీసీ సంక్షేమ సంఘం హుజరాబాద్ నియోజకవర్గం మహిళా జనరల్ సెక్రెటరీ దేవసాని ప్రియదర్శిని ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించనైనది. దేవసాని ప్రియదర్శిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ రిటైర్మెంట్ మూలంగా ఏర్పడిన గ్రూప్ వన్ గ్రూప్ టు ఖాళీలతో పాటు మిగతా పోస్టుల ఖాళీలను గత కొన్ని సంవత్సరంల నుండి భర్తీ చేయకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొత్త జిల్లాలు మండలాలలో ఉద్యోగ ఖాళీలను ఇప్పటివరకు భర్తీ చేయకపోవడమే కాకుండా ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏర్పడినటువంటి ఖాళీలను భర్తీ చేయకపోవడం మూలంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గా విద్యార్థులు ఎంతో నష్టపోతారని ఆవేదనను వ్యక్తపరచి నారు. అదేవిధంగా పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం మూలంగా శాంతిభద్రులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని శాఖలకు సంబంధించిన ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఇబ్బంది జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, జిల్లా అధ్యక్షులు సందెల వెంకన్న, కన్నెబోయిన రాజయ్య, కన్నెబోయిన సమ్మయ్య ,కన్నబోయిన సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శనివారం 01-08-2026

## హెచ్ఎంపీవీ కలకలం ఈ ఆహార పదార్థాలతో చెక్ పెట్టండిలా



హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఇండియాలోనూ కేసులు నమోదు అవుతున్నాయి. బెంగళూరు, అహ్మదాబాద్‌లో హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్ అవుతున్నాయి. అంతేకాకుండా హెచ్ఎంపీవీ వైరస్ నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలనే దానిపై డాక్టర్లు పలు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఈ వైరస్‌ను ఎదుర్కోవాలంటే మన మెనూలో స్వల్ప మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. డైట్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన త్వరగా కోలుకోనే సామర్థ్యం ఉంటుందని చెబుతున్నారు.

**ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలంటే..?**

యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. అంటే ఉసిరి, ఆరెంజ్, నిమ్మ, రెడ్ పెపర్ తీసుకోవాలి. ఉసిరిలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఆరెంజ్, నిమ్మలో కూడా విటమిన్ సీతో పాటు ఫ్లావినాయిడ్స్, లిమోనాయిడ్స్ ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. రెడ్ పెప్పర్‌లో విటమిన్ సీ, విటమిన్ బీ6, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా లభిస్తాయి. పసుపు, అల్లం, దాల్చిన చెక్క కూడా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు మంచి మెడిసిన్‌గా పని చేస్తాయి. విటమిన్ డీ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహార పదార్థాలను కూడా తీసుకోవాలి. చేపలు, మష్రూమ్స్(పుట్టగొడుగులు), పాల ఉత్పత్తులు కూడా మంచివి. రెండు రోజులకు ఒకసారి దానిమ్మ తింటే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ గ్రీన్ టీ సేవించొచ్చు.


# చలికాలమంటే భయం!



మా అబ్బాయి వయసు అయిదేండ్లు. చలికాలం మొదలైందంటే చాలు జలుబు, దగ్గుతో బాధపడుతుంటాడు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తే నెబ్యులైజర్ వాడమన్నారు. వాడితే తగ్గిపోతుంది. ఇలా ఎండకాలం వచ్చేదాకా నెబ్యులైజర్ వాడాల్సి వస్తుంది. మిగతా కాలంలో బాగానే ఉంటాడు. ఈ సమస్యకు పరిష్కారం సూచించగలరు? మీ బిడ్డకు శ్వాసనాళాలు కుంచించుకుపోయే 'హైపర్ యాక్టివ్ ఎయిర్‌వే డిసీజ్' ఉండి ఉండొచ్చు. చల్లని వాతావరణం, దుమ్ము, కాలుష్యం, శ్వాస సంబంధమైన ఇన్ఫెక్షన్ల బారినపడినప్పుడు కొందరిలో శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. ఇలా జరిగినప్పుడు పిల్లల్లో పిల్లికూతల వంటి చప్పుడు వస్తుంది. ఇది పెద్దవాళ్లలో ఉండే ఆస్తమా లాగా ఉంటుంది. ఈ సమస్యకు నెబ్యులైజర్ ఉపశమనం కలిగిస్తుంది. బిడ్డకు పదేపదే ఇలా జరుగుతుంటే దీని నివారణ కోసం చికిత్స కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఇన్‌హేలర్ వాడాలి. మన సమాజంలో ఇన్‌హేలర్ వాడకం పట్ల అపోహలు, భయాలు ఉన్నాయి. ఇన్‌హేలర్ తక్కువ డోసులో సమస్య తీవ్రతను తగ్గిస్తుంది. మీ బాబుని శ్వాసకోశ నిపుణులకు చూపించండి. ప్రివెంటివ్ థెరపీ, ఇన్‌హేలర్ థెరపీ అవసరాన్ని బట్టి తీసుకోండి. ఏ కారణం వల్ల ఈ సమస్య వస్తుందో గుర్తించడం అన్నిటికన్నా ముఖ్యమైన విషయం. సమస్యకు కారణం తెలిస్తే పిల్లల్ని దానికి దూరంగా ఉంచితే అది పరిష్కారమైనట్టే. డైరీ పెట్టుకుని ఎప్పుడు ఇబ్బంది పడుతున్నాడు? ఎంత తీవ్రంగా ఉంది? మందు ఇస్తే, దాని ప్రభావాన్ని రాస్తూ పోవాలి. అలాగే ఎదుగుదల ఎలా ఉందో కూడా రాయాలి. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కూడా దీనికి కారణం కావొచ్చు. మీ బిడ్డ సమస్య ఆస్తమా అయి ఉండొచ్చు. మీ ఇంట్లో ఎవరికైనా ఎలర్జీ, ఆస్తమా వంటి లక్షణాలు ఉన్నదీ, లేనిదీ చెప్పలేదు. ఆస్తమా అంటే చాలామంది భయపడతారు. పద్ధతి ప్రకారం వైద్యం చేస్తే ఆస్తమాను తగ్గించవచ్చు. ఇప్పుడు మీరు రెండు ముఖ్యమైన పనులు చేయాలి. బిడ్డకు పోషకాహారం ఇవ్వడం ద్వారా ఈ అనారోగ్య సమస్యను తట్టుకునేలా సిద్ధం చేయడం మొదటిది. పిల్లల శ్వాసకోశ వైద్యులు సూచించిన మందులు, ఇన్‌హేలర్ వాడటం రెండోది. వీటివల్ల కొంత ఉపశమనం లభించవచ్చు.

### చలికాలంలో వెచ్చగా ఉండాలా

# అయితే రోజూ లవంగాలను తినండి



చలికాలం మరింత ముందుకు సాగింది. అనేక చోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో చలి నుంచి తమను తాము రక్షించుకునేందుకు చాలా మంది అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. చలికాలంలో చలి నుంచి రక్షణగా ఉండేందుకు చాలా మంది ఉన్ని దుస్తులను ధరిస్తుంటారు. అలాగే తీసుకునే ఆహారంలోనూ అనేక మార్పులు చేస్తుంటారు. అయితే చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. వాటిల్లో లవంగాలు కూడా ఒకటి. లవంగాలనుఈ సీజన్‌లో తీసుకోవడం వల్ల శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. అలాగే లవంగాలను తినడం వల్ల మనకు పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కనుక ఈ సీజన్‌లో లవంగాలను తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

**కాళ్లు, చేతులు కూడా..**

చలికాలంలో మనం శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలను ధరిస్తుంటాం. అయినప్పటికీ మన కాళు ,, చేతులు చల్లగా మారుతుంటాయి. న్యూట్రిషనిస్టులు చెబుతున్న ప్రకారం మన శరీరంలో రక్త సరఫరా లేనందువల్లే కాళ్లు, చేతులు చల్లగా ఉంటాయట. అందుకనే మిగిలిన శరీరం మొత్తం వెచ్చగా ఉన్నప్పటికీ కాళ్లు, చేతులు చల్లగా ఉంటాయి. అయితే లవంగాలను తినడం వల్ల కాళ్లు, చేతులను కూడా పూర్తిగా వెచ్చగా ఉంచుకోవచ్చు. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. చలికాలంలో కచ్చితంగా లవంగాలను ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. లవంగాలను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో కాళ్లు, చేతులకు రక్తం సరిగ్గా సరఫరా అవుతుంది. ఫలితంగా ఆయా భాగాలు కూడా వేడిగా ఉంటాయి. లవంగాల్లో యూజినాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తనాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా పెరుగుతుంది. ఫలితంగా చల్లగా ఉండే చేతులు, కాళ్లు కూడా వెచ్చగా మారుతాయి. ఇక లవంగాలను తినడం వల్ల పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.


**యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ..**

లవంగాల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చాలా శక్తివంతమైనవి. ఫ్రీ ర్యాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ సీజన్‌లో వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. లవంగాల్లో యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు నొప్పి, దగ్గు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. లవంగాలలో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం జెర్మిసైడల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. నోట్లో ఉండే పుండ్లు కూడా తగ్గుతాయి. లవంగాల్లో ఉండే యూజినాల్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. విరేచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది.

**అధిక బరువు తగ్గుతారు..**

లవంగాలను తినడం వల్ల అధిక బరువును తగ్గించుకోవచ్చు. లవంగాలను తింటే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. ఫలితంగా అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. లవంగాలు మన చర్మానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో చర్మం మృదువుగా మారి మెరుస్తుంది. అదేవిధంగా జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. గ్యాస్, మలబద్దకం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా లవంగాలతో మనం ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.

# జడిపిస్తున్న మరో వైరస్



నాన్నా పులి కథ అందరికీ తెలుసు! కానీ ఇప్పుడు అందరం నాన్నా.. వైరస్ కథ చూస్తున్నాం! ప్రపంచంలో ఏదో మూల ఏదో ఒక వైరస్ వ్యాప్తి ఎక్కువ అవగానే మరో ప్రళయం రాబోతుందనే స్థాయిలో సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నది. ముందుగా వైరస్ పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకుందాం. వైరస్‌లు కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఆవిర్భవించాయి. ఇవన్నీ వ్యాధి కారకాలే. అవి మొక్కల్లో, జంతువుల్లో, మానవుల్లో వ్యాధులను కలిగిస్తుంటాయి. కొన్ని వైరస్‌లు బాక్టీరియాలపైనా దాడి చేస్తాయి. అతిథేయి లేకుండా వైరస్ ప్రత్యుత్పత్తి కొనసాగించలేదు. వైరస్‌ను నిర్జీవజీవిగా వర్ణిస్తారు. దానికి జీవుల లక్షణాలు, నిర్జీవుల లక్షణాలు రెండూ ఉంటాయి. అతిథేయి దేహంలో జీవిగా, బయట నిర్జీవిగా మనుగడ సాగిస్తుంది. మానవులలో వైరస్ వ్యాధులు నియోలిథిక్ కాలం నుంచీ ఉన్నాయి. 12 వేల ఏండ్ల క్రితమే వైరస్‌లు మానవుల్లో వ్యాధిని కలిగించాయి. మనిషి పరిణామ క్రమంలో సంఘజీవిగా మారినప్పటి నుంచీ వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడం మొదలయింది. స్మాల్‌పాక్స్. మీజిల్స్ అతిప్రాచీనమైన వైరస్ వ్యాధులు. మనుషుల్లో వ్యాధి కారక వైరస్‌లు.. మొదట జంతువుల్లో లేదా పక్షులలో వ్యాధిని కలిగించే వైరస్‌లు (జునోటిక్/ ఏవియన్ వైరస్). 15వ శతాబ్దంలో ఇన్‌ఫ్లుయెంజా, ఫ్లూ వ్యాధులు లక్షలాదిమంది మరణాలకు కారణమయ్యాయి. ఇవే వ్యాధులు 17వ శతాబ్దంలోనూ విస్తృతంగా వ్యాప్తి చెందా యి. 18వ శతాబ్దంలో స్మాల్‌పాక్స్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా విలయానికి కారణమైంది. 19వ శతాబ్దంలో వాక్సిన్స్ కనుగొన్న తరువాత స్మాల్‌పాక్స్‌ను అరికట్టగలిగాం. పోలియో, మీజిల్స్, ముంప్స్, రుబెల్లా వంటి వాటి వ్యాప్తిని నివారించగలిగాం. కానీ, కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూ మానవాళికి కొత్త సవాళ్లను విసురుతూనే ఉన్నాయి. మానవ అభివృద్ధి జరిగిన కొద్దీ జీవన విధానంలో మార్పులు వస్తూ ఉన్నాయి. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, విస్తృత రవాణా సదుపాయాల వంటివి కొత్త వైరస్‌ల ఆవిర్భావం, వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మానవాళి ప్రధానంగా జునోటిక్ వైరస్‌లు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లు, అర్బోరి వైరస్‌ల (కీటకాల నుంచి సంక్రమిస్తుంది) వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నది. 20, 21 శతాబ్దంలో ఈ వైరస్‌ల నుంచి అనేక ప్రమాదాలు ఎదుర్కొన్నాం. ఫ్లూను కలగజేసే ఇన్‌ఫ్లుయెంజాను ఉదాహరణగా తీసుకుంటే, 1899లో 2.5 లక్షల మరణాలు, 1918లో స్పానిష్ ఫ్లూగా రూపాంతరం చెంది 5 కోట్ల మరణాలు, 1950లో ఆసియన్ ఫ్లూగా 10 లక్షల మరణాలు, 2009లో స్వైన్ ఫ్లూ రూపంలో అనేక మరణాలకు కారణమైంది. అలాగే, ఎల్లో ఫీవర్ వైరస్ ప్రతి దశాబ్దంలోనూ విజృంభిస్తున్నది. 19వ శతాబ్దం మొదట్లో పుట్టుకొచ్చిన హెపటైటిస్ వైరస్ ఇప్పటికీ వ్యాధులను కలిగిస్తూనే ఉన్నది. ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా వైరస్‌తో మానవుడు పోరు సలుపుతూనే ఉన్నాడు. ప్రపంచం ప్రస్తుతం జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందే శ్వాసకోశ వ్యాధికారక వైరస్‌ల నుంచి పెను ప్రమాదం ఎదుర్కొంటున్నది. అతి తీవ్ర శ్వాసకోశ వ్యాధులు (సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్) మానవులకు చాలా ప్రమాదకరంగా ఉంటున్నాయి. గతంలో వచ్చిన 'సార్స్','మెర్స్'తో పాటు 2019 లో వచ్చిన కొవిడ్-19 ప్రపంచాన్ని చిన్నాభిన్నం చేసింది. కోట్లాదిమంది మృతికి కారణమైంది. ఈ వైరస్ ప్రభావం నుంచి ప్రపంచం ఇప్పుడిపుడే కోలుకుంటున్నది. ప్రస్తుత కాలంలో ఏ కొత్త వైరస్ పేరు విన్నా మానవాళి ఆందోళనకు గురి అవుతున్నది. ఇప్పుడు చైనాలో మరో వైరస్ హ్యూమన్ మెటాన్యూమోనిక్ వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు పెరగ్గానే ప్రపంచంలో అలజడి మొదలయింది. కానీ ఇది చాలా పాత వైరస్. 2001 లోనే దీనిని డచ్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రపంచంలో అనేక దేశాలలో ఈ వైరస్ సోకినప్పటికీ మరణాలు ఎక్కువగా లేవు. ఎండమిక్ గానే ఉంది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో ఉంది. భారతదేశంలో కూడా వేర్వేరు ప్రాంతాల్లో హెచ్ఎంపీవీ వ్యాప్తిని 2008 నుంచి 2023 వరకు గమనించారు. అయితే, ఇక్కడ కూడా భారీ నష్టాన్ని ఏమీ కలిగించలేదు. ప్రధానంగా ఐదేండ్లలోపు పిల్లలు, వయోధికులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువ. మిగిలిన వారిలో కేవలం జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్ యొక్క వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి జనబాహుళ్యంలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూనే ఉంటాయి. మ్యుటేషన్స్, జెనెటిక్ షిఫ్ట్, స్పీసిస్ జంప్ వల్ల ఇలా జరుగుతుంది. ప్రతీ కొత్త వైరస్ ప్రమాదభరితం కాదు. కాకపోతే, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆందోళన అసలే అవసరం లేదు. సోషల్ మీడియా పుకార్లతో 'నాన్నా! వైరస్' స్థితికి రావద్దు.

# దగాకోరు ప్రభుత్వం దిక్కుమాలిన పాలన



'ముందు దగా వెనుక దగా కుడి ఎడమల దగా దగా'.. మహా కవి శ్రీశ్రీ చెప్పిన మాటలు రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి అద్దం పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు సాయం, కౌలు రైతులకు సాయం, ప్రతి పంటకు బోనస్ లాంటి ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది. ఏడాది కాలంగా రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉన్నది. రూ. 2 లక్షల రుణమాఫీని డిసెంబర్ 9న మొదటి సంతకంతో ప్రారంభిస్తానని చెప్పి మాట తప్పి రేవంత్ సర్కారు మోసం చేసింది. రుణమాఫీపై నాన్చివేత వైఖరిని బీఆర్ఎస్ గట్టిగా ఎండగట్టడంతో దిగొచ్చిన ప్రభుత్వం ఆగస్ట్ 15 లోగా పూర్తి చేస్తామని రాష్ట్రంలోని అందరి దేవుళ్లపైనా ఒట్టు వేసి ప్రజల సెంటిమెంట్‌ను వాడుకొని పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కింది. హరీశ్‌రావు సవాలు తర్వాత రుణమాఫీకి సవా లక్ష కండిషన్లు పెట్టడంతోపాటు రూ. 31 వేల కోట్లకు కుదించి, బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు ప్రతిపాదించి కేవలం రూ. 20.16 వేల కోట్లను 25.35 లక్షల రైతులకు మాత్రమే మాఫీచేసి రుణమాఫీ అయిపోయిందని కాంగ్రెస్ దబాయిస్తున్నది. ఇక, రెండో మోసం బోనస్. వరి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరకు, జొన్నలు వంటి 10 పంటలకు మద్దతు ధరకు అదనంగా బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. ఆ హామీ బోగస్‌గా మారింది. తొలుత అన్ని వడ్లకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకేనని కోతలు పెట్టింది. వానకాలంలో 156 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, ప్రభుత్వం కొనుగోలు చేసింది 50 లక్షల టన్నులే. పండిన ధాన్యంలో 30 శాతం కొనుగోలు చేసి బోనస్ అమలు చేశామని గొప్పలు చెప్పుకున్నది. రైతు భరోసా రైతులకు తీరని వ్యథగా మారింది. ఎకరానికి రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి రూ. 15 వేల చొప్పున పెట్టుబడి సాయంగా ఇస్తామని హామీ ఇచ్చి 2024 మొత్తం ఇవ్వకుండానే ఎగ్గొట్టింది. 2023లో యాసంగి అక్టోబర్‌లో అప్పటి కేటీఆర్ ప్రభుత్వం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసి ఇవ్వకుండా అడ్డుకున్నది. ఏడాదిగా రెండు పంటలకు రైతుభరోసా ఇవ్వలేదు. ఇప్పుడేమో ఎకరానికి రూ. 12 వేలు మాత్రమే, అదికూడా సాగు యోగ్యత కలిగిన భూమికి మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నది. కేసీఆర్ తీసుకున్న అనేక నిర్ణయాల వల్ల రాష్ట్రంలో వానకాలంలో సాగునీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో 136 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. అయితే, యాసంగిలో నీటి కొరతతో సాగు 60 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమై పోయిం ది. మిగిలిన 76 లక్షల ఎకరాలు సాగు యోగ్యమైనా నీళ్ల కొరతతో సాగు కాలేదు. కాబట్టి ప్రభు త్వం 136 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇస్తుం దా? లేదంటే 60 లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చి 76 లక్షలకు ఎగ్గొడుతుందా? అన్నది చూడాలి. 2024లో ఎకరానికి రూ.17,500 చొప్పున రైతులకు బాకీపడిన సొమ్మును ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించిన కేటీఆర్ నోరు మూయించడానికి, నిర్బంధించడానికి కుట్రలకు తెరలేపారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని కాంగ్రెస్ మరో హామీనిచ్చినా ఇప్పటి వరకు భూమి లేని రైతు కూలీలు ఎంతమంది ఉన్నారో తెలుసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. ఇచ్చిన హామీని అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన అంశం పట్ల కూడా కనీసం ఆలోచన లేకపోవడం నిరుపేదలపై కాంగ్రెస్‌కు ఉన్న కపట ప్రేమకు నిదర్శనం. కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని డిసెంబర్ 28న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క హడావుడిగా ప్రకటించారు. దీంతో సీఎంకు కోపం వచ్చినట్టుగా ఉంది. అందుకే రైతు కూలీ పథకాన్ని జనవరి 26 తర్వాత అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి ఎలాంటి విధివిధానాలు ప్రకటించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ఏడాది దాటినా ఒక్క దానినీ సంపూర్ణంగా అమలు చేయలేదు. ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు ఇంటి స్థలం, మహిళలకు రూ. 2,500 భృతి, రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు మొదలే కాలేదు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం జాడే లేదు. 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, అమరవీరుల కుటుంబాలకు పెన్షన్, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, రిటైర్ అయిన ఉద్యోగులకు ప్రయోజనాలు, అంగన్వాడీ, ఆశ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల జీతాల పెంపు, కామారెడ్డి, వరంగల్ డిక్లరేషన్ మొదలగునవి కనుచూపు మేరలో లేవు కూడా. కేసీఆర్ ప్రభుత్వం దరఖాస్తు, దస్కత్ లేకుండా సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేసింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యమ సమయంలో గుర్తించిన కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రజల ఆకాంక్షలనే ప్రభుత్వ అజెండాగా మార్చి పదేండ్లు వికాసంపైనే దృష్టిసారించి రాష్ట్రాన్ని పరుగులు పెట్టించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే వికాసాన్ని విధ్వంసంగా మార్చింది. కేసీఆర్ ఆనవాళ్లను తుడిచేస్తామని చెప్తూ ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నది. చివరికి తెలంగాణ అస్తిత్వంపై చేసిన వికృత రాజకీయం వికటించి తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురైంది. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, బతుకమ్మ మాయం, కాకతీయ, చార్మినార్ చిహ్నాల మార్పు వంటి వాటిని బీఆర్ఎస్ వ్యతిరేకులు సైతం జీర్ణించుకోలేకపోయారు. ఇటీవల కేటీఆర్ చెప్పినట్టు ప్రతిరోజూ ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయాల్సిన స్థితిని రేవంత్‌రెడ్డి స్వయంగా కల్పిస్తున్నారు. ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషించి ప్రజల పక్షా నిలిచి రాజీలేని పోరాటాలు చేసి విజయం సాధించడం బీఆర్ఎస్ ముందున్న కర్తవ్యం. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, ఉద్యమాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు. 14 ఏండ్లు కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సుదీర్ఘ లక్ష్యాన్ని ఛేదించి జాతీయ పార్టీల మనుగడకే ప్రమాద ఘంటికలు మోగించిన బీఆర్ఎస్ అన్ని అడ్డంకులను ఎదుర్కొని అజేయంగా విజయం వైపు అడుగులు వేస్తున్నది.

# షుగర్ ఉన్నవారు రాత్రిపూట ఎన్ని చపాతీలను తింటే మంచిది



ప్రస్తుత తరుణంలో చాలా మంది డయాబెటిస్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికే షుగర్ వ్యాధి వచ్చేది. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే డయాబెటిస్ రాగానే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. షుగర్ కంట్రోల్ లో ఉంటే దీర్ఘకాలం పాటు జీవించవచ్చని అంటున్నారు. అయితే డయాబెటిస్ కంట్రోల్ అవ్వాలంటే డాక్టర్లు ఇచ్చే మందులను తప్పనిసరిగా క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. దీంతోపాటు రోజుకు తగినంత నిద్ర పోవాలి. నీళ్లను తాగాలి. అదేవిధంగా డైట్‌ను కూడా పాటించాల్సి ఉంటుంది. డయాబెటిస్ వచ్చిన వారు ఏ ఆహారాన్ని పడితే దాన్ని తినకూడదు.

**బరువు తగ్గాలి..**

షుగర్ వ్యాధి ఉన్నవారు తీసుకునే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా బరువును తగ్గించుకోవాలి. దీంతో ఆటోమేటిగ్గా షుగర్ కూడా కంట్రోల్ అవుతుంది. అయితే బరువు తగ్గడంతోపాటు ఆ బరువు నియంత్రణలో ఉండేలా చూడాలి. దీంతో షుగర్ లెవల్స్ ఎప్పటికీ పెరగకుండా ఉంటాయి. దీనికి గాను ఎప్పటికీ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బరువును పెంచే ఆహారాలను తినకూడదు. ఇవి షుగర్ లెవల్స్‌ను కూడా పెంచుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. షుగర్ ఉన్నవారు ఆహారం విషయంలో మాత్రం అనేక జాగ్రత్తలను పాటించాల్సిందే. లేదంటే షుగర్ కంట్రోల్ అవదు.

**పుల్కా మాదిరిగా చేసి తినాలి..**

ఇక డయాబెటిస్ ఉన్నవారు చపాతీలను తినాలని సూచిస్తుంటారు. ఎందుకంటే రైస్‌తో పోలిస్తే చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ కాస్త తక్కువగా ఉంటుంది. పైగా గోధుమ పిండిలో ఫైబర్ ఉంటుంది కనుక చపాతీలను తింటే అంత త్వరగా షుగర్ లెవల్స్ పెరగవు. అందువల్లనే చాలా మంది రాత్రి పూట భోజనంలో అన్నంకు బదులుగా చపాతీలను తింటుంటారు. బరువు తగ్గాలనుకునే వారు కూడా తమ డైట్‌లో చపాతీలను చేర్చుకుంటారు. రాత్రి పూట రెండు చపాతీలను నూనె లేకుండా పుల్కా మాదిరిగా కాల్చుకుని తింటే ఎంతో మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట ఎన్ని చపాతీలను తినాలని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎన్ని చపాతీలు తినాలంటే..?**

చపాతీల్లో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. వీటిల్లో ఫైబర్ ఉంటుంది కనుక వీటిని తింటే జీర్ణక్రియ కూడా మెరుగు పడుతుంది. అయితే రాత్రి పూట 30 నుంచి 50 గ్రాముల మేర పిండి పదార్థాలు లభిస్తే చాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంటే మీడియం సైజ్ ఉన్న చపాతీలు అయితే 2 లేదా 3 చాలు. పెద్దవి అయితే 2 చాలు అని వైద్యులు చెబుతున్నారు. ఇలా చపాతీలను తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, దీంతోపాటు షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయని అంటున్నారు. అయితే కొందరు అన్నం మానేస్తున్నామని చెప్పి చపాతీలను అధికంగా తింటారు. ఇలా చేసినా కూడా అనర్థమేనట. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయని అంటున్నారు. కనుక రాత్రి పూట పరిమిత మోతాదులో చపాతీలను తింటేనే వీటి ద్వారా ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.